# 7

## జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

చెన్‌లోకి వెళ్ళింది సునయన. స్టౌమీద గిన్నెలో అన్నం ఉడుకుతున్న శబ్దం. ముందుగా కుతకుతలు.... ఆపైన ఉడికిన పరిమళం... సిమ్‌లో పెట్టాక మెతుకుల మధ్య పేలే నీటి అణువుల చిటపటలు... ఉమ్మగిల్లాక గుమ్మనే కమ్మని వాసన... ఆ వెంటనే స్టౌ కట్టెయ్యడం... స్నానానికి బయల్దేరడం!

✦ ✦ ✦

స్నానం చేసివచ్చాక నులివెచ్చని లేతరంగు చీర కట్టుకుంది.

గబగబా భోజనం అయిందనిపించింది. ఫ్లాట్‌కి లాక్ చేసి బయలుదేరింది.





# నా కళ్ళతో చూడు...

ఆమె కళ్ళద్దాలు సర్దుకుంటూ రావడాన్ని గమనించాడు లిఫ్ట్‌బాయ్. అందుకే ఆమె వచ్చేంత వరకూ ఆపాడు. ఆమె ఆదరంగా అందించిన చాక్లెట్ తీసుకున్నాడు.

లిఫ్ట్‌లోంచీ బయటపడి ఎడంవైపు పాతి కదుగులు వేస్తే మెయిన్‌గేటు. అక్కడినుంచీ పది నిముషాల నడక దూరంలో హైవే. ఆ పక్కనే బస్టాపు. అక్కడ బైక్ మీద ఎదురుచూస్తూంటాడు సురేష్.

అతను ఆఫీసుకి బైక్ మీద తీసుకువెళతా నంటాడు. ఆమె మాత్రం సిటీ బస్సంత సేఫ్టీ ఇంకొకటి లేదంటుంది.

అతని పలకరింతకి చిరునవ్వుని బహు మతిగా ఇచ్చింది. బస్సు వచ్చేంత వరకూ అతనితో కబుర్లు చెప్పింది. అల్లంత దూరంలో బస్సు కనిపించగానే ఆమెకి తను చెప్పాలనుకుంటున్న మాటని చెప్పేశాడు; "నీ కళ్ళు చాలా అందంగా వుంటాయి. సరిగ్గా నీ పేరుకి తగినట్లుగానే."

చిరునవ్వుతో అంది; "అబద్ధం ఆడినా అతికి నట్లుండాలి బాసూ"

"అబద్ధం కాదు..., అక్షరసత్యం"

"ఎందుకయినా మంచిది. ఓసారి కంటి డాక్టరుకి చూపించుకో"

జోకులొద్దు, అంతగా నమ్మలేక పోతే... నా కళ్ళతో చూడు"

చిరునవ్వుతో అంది "చూద్దాం"

పై చూపు....

బస్సులో ఎక్కింది సునయన. సిటీబస్సులో ఆమెకోసం ఓ సీటు రిజర్వు చెయ్యబడి వుంటుంది. అందుకే అంతవరకూ ఆ సీట్లో కూర్చున్న కాలేజీ అమ్మాయి ఆమెని చూడగానే చిరునవ్వుతో సీటు ఖాళీ చేసింది.

థాంక్స్ చెప్పి తన సీట్లో కూర్చుంది సునయన.

బస్సు కదిలింది.

ఉదయం పూట బస్సులో ప్రయాణీకులంతా ఫ్రెష్‌గా వుంటారు కాబట్టి రుద్దుకున్న సబ్బులూ అద్దుకున్న పౌడర్లూ స్ప్రే చేసుకున్న ఫెర్‌ఫ్యూములూ ఓ గమ్మత్తైన మత్తెక్కించే పరిమళాన్నిస్తాయి. దానికీ ఇంజన్‌లో వినియోగమయ్యే ఇంధనం వాసనకీ ఏమాత్రమూ పొసగదు. అదే సాయంత్రం పూట తిరుగు ప్రయాణంలో అయితే ఇంజన్‌లోని ఇంధనం వాసనకి తోడుగా, పగలల్లా ఒళ్ళొంచి పనిచేసినందుకు సాక్షిగా విడుదలయిన చెమట వాసన చేరుతుంది. ఆ రెండూ పరస్పరం పూరకాలై శ్రమశక్తిని చాటు తాయి. అందుకే ఆమెకా వాసనంటే ఇష్టం.

బస్సు వేగంగా ప్రయాణిస్తోంది. సునయన అంతకంటె వేగంగా శూన్యంలోకి ప్రయాణిస్తోంది. మెల్లగా గాల్లోకి లేచింది.... ఆకాశంలోకి ఎగిరి నల్లటి వెండిమబ్బుల్లో దిగింది. చుట్టూ రంగు రంగుల చీకట్లు. చిన్నపిల్లలా ఆడింది పాడింది. నింగికి విరగకాసిన చుక్కల్ని మబ్బుల అంచులమీద నించీ అందుకుని ఒలుచుకు తింది. ఆపైన మిగలమగ్గిన ఇందు ఫలం కోసుకుంది. దాన్ని భద్రంగా కొంగున కట్టుకుంది. అది చిలక కొట్టిన జాంపండు కంటె రుచిగా వుంటుంది. అంతేకాదు, ఆ మబ్బుల్లో మెరిసే సలిల బిందువుల్ని మాలగా అల్లి మెడలో వేసుకుని మురిసిపోవడం. ఆకాశ కాసారంలో విరిసే ఆదిత్య కమలాన్ని సిగలో తురుముకుని మెరిసిపోవడం ఆమెకి ఇంకా ఇష్టం.

అంతలోనే తను దిగాల్సిన స్టేజి వచ్చేసింది. దాంతో మళ్ళీ కలగాపులగం కంపుతో నిండిన బస్సులోకి వచ్చి పడింది.

బస్సు దిగి నాలుగడుగులైనా వేసిందో లేదో సురేష్ బైకు వచ్చి ఆమె ముందాగింది. అక్కడినించీ అరకిలోమీటరు దూరంలో ఉంటుందామె పనిచేస్తున్న ఆఫీసు. దానికి అవతలివైపున ఉందతను నడుపుతున్న ఆర్ట్ ఎగ్జిబిషన్ కమ్ సేల్స్. అందులో ఉందతను కొత్తగా వేసిన పెయింటింగ్. దాన్ని చూపించడానికే ఆమెను తీసుకువెళుతున్నాడు.

షాపులో ఆమెని కూర్చోబెట్టి కాఫీ తెప్పించాడు.

తను వేసిన పెయింటింగ్ తెచ్చి ఆమె చేతి కందించాడు.

ఆ పెయింటింగ్ పేరు ప్రకృతి కన్య.

సునయనకి ఆ పెయింటింగ్ ఆంతర్యాన్ని వివరించడం మొదలుపెట్టాడు. చుట్టూ చీకట్లు కమ్మిన ఆకాశమే ఆమె కేశసంపద. మధ్యనున్న శరత్ చంద్రబింబం ఆమె ముఖకమలం. ఈ చేపలేమో కళ్ళు, సంపెంగ నాసిక..."

అతను ఆ తరవాత చెప్పబోయేదాన్ని తనే అందుకుంది సునయన; బాగుంది ఆ చేపలు కంపు ఈ సంపెంగ ఇంపు. పెదాల బదులు దొండపళ్ళు, మెడ బదులుగా ఓ శంఖం. చెవులుగా శ్రీకారాలు గీకి దాన్నే కన్యక రూపంగా దబాయించెయ్యడం. మీ సౌందర్య పిపాసులకి ఉన్నదాన్ని ఉన్నట్లుగా చూడటం చేతకాదు గాబోలు. అయినా సురేష్..., మీరంతా ప్రకృతిని కన్యగానే ఎందుకు వర్ణిస్తారు? నిజానికి ప్రకృతి మాతంటే అనంతానంత ప్రసవాల అనుభవాలు పండించే నిండు ముత్తైదువ కాదా?"

సురేష్‌కి ఆమె మాటలు అర్థమైనా ఉన్నదాన్ని ఉన్నట్లుగానే చూడటంలో రసదృష్టి ఉండదని ఆమెకి తెలియజెప్పడానికే అన్నాడు; నీ మాటా నిజమే కానీ ఓ వడిలిపోయిన ముదివగ్గుని చిత్రించి దాన్నే ప్రకృతిగా అన్వయించుకొమ్మంటే రసికులు మెచ్చరు.

చిరునవ్వుతో అంది సునయన, "అందుకని అబద్దాలనే నిజాలుగా నమ్మబలికి దాన్నే రసానుభూతిగా ప్రచారం చెయ్యడం తప్పు కాదూ?"

"కాదు. అందాలెప్పుడూ జ్ఞాన నేత్రాలకి అందవు. అంచేత వాటిని విశ్లేషించకూడదు. అనుభూతించాలి, అంతే!"

'అందుకు నేనేం చెయ్యాలి'

'సింపుల్. దాన్ని.... నా కళ్ళతో చూడు'

సాలోచనగా చిరునవ్వుతో అంది; 'చూద్దాం'

చూపు.....

విహారయాత్రా స్పెషల్ హంపీ విజయనగరంలో విరూపాక్షస్వామి దేవాలయం ముందాగింది.

ముందుగా దిగాడు సురేష్. ఆదరంగా సునయన చేతినందుకున్నాడు. ఆమె దిగింది. ఇద్దరూ ముందుకి నడుస్తున్నారు.

పెళ్ళి కాని ఆడామగా కాస్త చనువుగా వుంటే చాలు గుంపుల్లో మొదలవుతాయి గుసగుసలు. వాటి నెంత మాత్రం పట్టించుకోకుండా తమదారిన తాము వెళ్ళిపోయారు ఆ ఇద్దరూ.

ఇద్దరూ విఠలాలయానికి వెళ్ళారు.

ఏకశిల రథముపై లోకేశు ఒడిలోన ఓరచూపులదేవి ఊరేగి రాగా....

సురేష్ వెంట – స్వప్న సౌధాల మధ్య, తనూ ఊహల పల్లకిలో ఊరేగింది.

రాతిస్తంభాలకే చేతనత్వము కలిగి సరిగమా పదనిసా పదములే పాడగా....

ఆ సప్తస్వరాల్ని మైమరచి వింది. దానికి తోడుగా ఘంటసాలతో పోటీపడే సురేష్ గాన మాధుర్యాన్ని ఆలకిస్తూ ఆనందభైరవి అయింది.

రత్నాల అంగళ్ళూ అశ్వశాలలూ, గజశాలలూ కలియతిరిగింది.

అక్కడి శిల్పవైభవాన్నంతా అక్షరాల్లోకి అనువదిస్తూ అభివర్ణిస్తూ ఆనందంతో ఆదమరుస్తూ అన్నాడు "చూడు సునయనా, ఉలి మలిచిన రాళ్ళు కూడా ఈ అందాలనీ అద్భుతాలనీ .... నా కళ్ళతో చూడు"

సాలోచనగా అంది సునయన, "చూద్దాం" లో చూపు....

అది.... సురేష్, సునయనల తొలిరేయి.



తలపుల తలుపులు తీసుకుని... వలపు పంటలు పండించుకుంటూ ఆమె నొసటన పొటమరించిన చెమట బిందువుల మెరుపుల్ని చూసి ముగ్ధుడౌతూ ఆమె ముంగురులని సవరిస్తూ అన్నాడు సురేష్, "ఈ ప్రపంచం ఒక్కొక్కరికీ ఒక్కొక్క కోణంలోంచీ ఒక్కో కొత్తరూపాన్ని సంతరించుకుంటూ కనువిందు చేస్తుంది. అలాగే నీ కన్నుల్లోని వేనవేల భావాలు నీకు కనపడవు. అవి నాకు మాత్రమే కనిపిస్తాయి. ప్రియా, వాటన్నింటినీ చూడాలనుకుంటే ఇక నుంచీ నా కళ్ళతో చూడు."

ఈసారి మాత్రం 'చూద్దాం' అనలేదు సునయన.

"సురేష్, ఒకవేళ నేను నీ కళ్ళతో చూశాననుకో అప్పుడు నాకు నువ్వు చూడగలిగినవి మాత్రమే కనిపిస్తాయి. అదీ వెలుతురున్నప్పుడు మాత్రమే. ఒకవేళ కరెంటు పోయిందనుకో నువ్వే కట్టుకున్న నీ స్వంత ఇంట్లో స్వయంగా నీ చేతులతో నువ్వే అమర్చుకున్న వస్తువులు సైతం నీకు కనపడవు."

అతనికి తను చేసిన పొరపాటేమిటో అర్థమవుతూండగా తను చెప్పాలనుకున్నదాన్ని చెప్పుకుపోతోంది సునయన, "నాకు తెలుసు నేనంటే నీకు ప్రాణం. చెప్పలేనంత ఇష్టం. ఆ ఇష్టంతోనే నాకీ ప్రపంచాన్ని నీ కళ్ళతో చూపించాలని అనుకుంటు న్నావని కూడా నాకు తెలుసు. కానీ సురేష్ ఒక్కమాట.... నీ కళ్ళతో చూస్తే ఏదంటే ఏడు రంగుల కాంతి తప్ప ఇంకేమీ కనపడదు. ఆ రంగుల్ని నా కొనవేళ్ళు గుర్తిస్తాయి. అదే నా కళ్ళతో చూస్తే... చుట్టూ ఆవరించిన రంగు రంగుల చీకట్లు.... ఆ చీకట్లలోనే రూపుకట్టే అందమైన లోకాలు... ఆ లోకాల చుట్టూ అల్లుకున్న సుందర స్వప్నాలు... ఇవన్నీ కనిపించాలంటే ఒక్కసారి నా కళ్ళతో చూడు."

శూన్యంలోకి చూస్తున్న ఆమె గాజుకన్నుల్లో తొణికిసలాడుతున్న చైతన్యం అతని కన్నుల్ని ప్రదీప్తంగావిస్తోంది. అతని ముఖంలో వ్యక్తమౌతున్న భావాల్ని చూడలేని సునయన మాటలు కొనసాగు తూనే ఉన్నాయి.

"వాసనని బట్టి వ్యక్తుల్ని గుర్తించాలన్నా శబ్దస్థాయిని బట్టి దూరాన్ని కొలవాలన్నా కేవలం స్పర్శతో హృదయాల్ని చదవా లన్నా, నా కళ్ళతో చూడు"

సురేష్ తన భవిష్యత్తులో ఏనాడూ ఆ మాటల్ని మరోసారి అనకూడదని నిర్ణయించు కుంటూండగా తన మాటల్ని చిరునవ్వుతో పూర్తి చేసింది సునయన, "మైడియర్ లవ్లీ పెయింటర్ బాబూ, చీకట్లో కూడా వెలుతురు కనిపించాలంటే, నా కళ్ళతో చూడు"

ఆమె పెదాలకి తన పెదాలతో తాళం వేస్తూ...

ఆమెనే అనుకరిస్తూ అన్నాడు సురేష్, "చూద్దాం"

